క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అవగాహన



కొత్తూరులో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యురాలు సౌమ్యశ్రీ

శంఖవరం: డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ సూచించారు. మండలంలోని కొత్తూరులో ప్రజలకు శుక్రవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడిస్ దోమ కుట్టడం వలన డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూట కుడుతుందన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమీ లేదని, లక్షణాలకు అనుగుణంగా చికిత్స పొందాలన్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్ల లాగడం, వాంతులు, చలి జ్వరం, పంటి చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. దోమల నియంత్రణకు దోమల తెరలు, మస్కిటో కాయిల్స్ ఉపయోగించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం



జగ్గంపేట డిగ్రీ కళాశాలలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో పెద్దాపురం లలితా ఎంటర్‌ప్రైజస్ ఆర్థిక సహకారంతో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. లలితా ఎంటర్‌ప్రైజస్ యాజమాన్యం చేస్తున్న సేవా కార్యక్రమాలను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో లలితా ఎంటర్ ప్రైజెస్ మేనేజింగ్ డైరెక్టర్ ఎంఎస్ ప్రసాద్, ఎం.శ్రీనివాస్, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ బాలరాజు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అత్తులూరి నాగబాబు అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మండల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఒమ్మి బిందు మాధవి పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి రక్షణ కల్పించాలని వినతి

గోకవరం: ఆర్టీసీ సిబ్బందికి రక్షణ కల్పించాలని స్థానిక ఆర్టీసీ డిపో ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ యు.రామన్నకు వినతి పత్రం అందజేశారు. కొందరు రాత్రి సమయంలో విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ సిబ్బందిపై భౌతిక దాడికి పాల్పడుతూ ఆర్టీసీకి, సిబ్బందికి నష్టం చేకూరుస్తున్నారన్నారు. దీనిపై తగు చర్యలు తీసుకుని దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఆర్టీసీ సిబ్బందికి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ చైర్మన్ పైడిమళ్ల లక్ష్మణ్, సెక్రటరీ అక్కిరెడ్డి కృష్ణ, చీకట్ల వెంకటేష్, బీఎస్ నారాయణ, డి.చంద్రశేఖర్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం నుంచి అరుణాచలానికి బస్సు సర్వీసు



జగ్గంపేటలో అరుణాచలం వెళ్లే బస్సును ప్రారంభిస్తున్న ఏలేశ్వరం డీఎం సత్యనారాయణ

జగ్గంపేట: ప్రతి నెలా పౌర్ణమికి అరుణాచలంలో జరిగే గిరిప్రదక్షిణకు ఏలేశ్వరం ఆర్టీసీ డిపో నుంచి బస్సు సర్వీసు నడుపుతున్నట్టు ఆ డిపో మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. జగ్గంపేటలో అరుణాచలం వెళ్లే బస్సును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణీకులకు అరుణాచలం గిరిప్రదక్షిణతో పాటు శ్రీకాళహస్తి, కంచి, కాణిపాకం, విజయవాడ తదితర పుణ్యక్షేత్రాలను చూపిస్తారన్నారు. ఏపీఎస్ఆర్టీసీ కల్పించిన ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



ఏలేశ్వరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు



ఎస్.అన్నవరంలో ముంపునకు గురైన నేల బీరపాదులు



రమణయ్యపేటలో వర్షానికి అధ్వానంగా మారిన ప్రధాన రహదారి



ఎన్.చామవరంలో ముంపుబారిన పడిన పత్తిపంట

వాన హోరు

- మెట్టలో ఎడతెరిపి లేకుండా వర్షం
- జలమయమైన రహదారులు, లోతట్టు ప్రాంతాలు
- పలు గ్రామాల్లో నీట మునిగిన వంట పొలాలు



ఏలేశ్వరం షిర్డీనగర్‌లో చెరువును తలపిస్తున్న రహదారి



గోపాలపట్నం-తొండంగి రహదారిలో నేలకొరిగిన నేమ్ బోర్డు



జాతీయ రహదారిపై అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

ఏలేశ్వరం: అల్పపీడనం ప్రభావంతో తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో శుక్రవారం ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి రోజంతా వర్షం పడుతూనే ఉంది. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.ప్రధాన రహదారులు నీట మునిగాయి. గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండిపోయింది. రహదారులపై రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలోని రమణయ్యపేటలో గోతులమయమైన ప్రధాన రహదారిపై వర్షపునీరు నిల్వ ఉండడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. పట్టణంలోని పలు కాలనీల్లో నీరు నిలిచిపోయింది. వంట పొలాలను వర్షపునీరు ముంచెత్తింది. అంటు రోగాలు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తగ్గని వాన

ప్రత్తిపాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం పడుతూనే ఉంది. ఎడతెరిపి లేని వర్షంతో గ్రామాల్లో జన సంచారం కనిపించలేదు. ఖరీఫ్‌కు సాగులకు ఈ వర్షాలు మేలు చేస్తాయని రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో రోడ్లపై నీరు నిలిచిపోయింది. పల్లెలో అంతంత మాత్రంగా ఉన్న రోడ్లు వర్షానికి మరింత శిథిలమయ్యాయి. ప్రత్తిపాడు, ఏలూరు, చినశంకర్లపూడి గ్రామాల్లో రోడ్లు, లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ప్రత్తిపాడులో 26.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

మునురుతో పత్తికి ముప్పు

తుని రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఆరుతడి పంటలకు నష్టం వాటిల్లుతోంది. మునురుతో పత్తి పంటకు ముప్పు వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాగే వర్షం కొనసాగితే పత్తి, ఆరుతడిగా సాగయ్యే బీర, బెండ, తదితర కూరగాయల పంటలు దెబ్బతింటాయని ఎన్.చామవరం, ఎస్.అన్నవరం, వి.కొత్తూరు, హంసవరం, హెచ్.కొత్తూరు, కుమ్మరిలోవ, తాళ్లూరు, తదితర గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంట పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా ఏర్పాట్లు చేసుకోవాలని ఉద్యాన అధికారి జి.వి జయలక్ష్మి సూచించారు. ఖరీఫ్‌లో వరిసాగు చేసేందుకు ఈ వర్షం మేలు చేస్తుందని వ్యవసాయ అధికారి బి.అశోక్‌కుమార్ తెలిపారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడిందని రైతులు పేర్కొన్నారు. వర్షానికి జన జీవనం స్తంభించింది.

లోతట్టు ప్రాంతాలు జలమయం

ప్రత్తిపాడు రూరల్: మండల వ్యాప్తంగా శుక్రవారం విస్తారంగా వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాలువలు, డ్రైనేజీలు ఉధృతంగా ప్రవహించాయి. రహదారులపై ఏర్పడిన గోతుల్లో వర్షపునీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. స్థానికులు అత్యవసర పనులు ఉంటే మినహా బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. జలాశయాలు, పంట చెరువుల్లో కొంత మేర వర్షపు నీరు వచ్చి చేరింది.

తెరిపివ్వని వాన

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండలవ్యాప్తంగా శుక్రవారం భారీ వర్షం కురిసింది. చెరువులు, కాలువలు వర్షంనీటితో పొంగిపొర్లాయి. కాగా పలు గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. రహదారులపై నీరు నిలిచిపోవడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షాలకు పలు చోట్ల ఇటుకబట్టీలు మూతపడ్డాయి. భవన నిర్మాణపనులు కూడా నిలిచిపోయాయి. ఈదురుగాలులకు పలు చోట్ల హోర్డింగులు, నేమ్‌బోర్డులు నేలకొరిగాయి. తొండంగి మండలం గోపాలపట్నం రైల్వే గేటుకు సమీపంలో ఆర్అండ్‌బీ సిబ్బంది ఏర్పాటు చేసిన బోర్డు నేలకొరిగింది. మరికొద్ది రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తీరప్రాంతంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్‌డీఓ సీహెచ్ ఉమామహేశ్వరరావు సూచించారు.



రాచపల్లి అడ్డురోడ్డులో కురుస్తున్న వర్షం

పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి



చినశంకర్లపూడిలో నీట మునిగిన నారుమడి

ప్రత్తిపాడు: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నారుమడులు, పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ యింటి వీర గంగాధర్ సూచించారు. మండలంలోని ప్రత్తిపాడు, రాచపల్లి తదితర గ్రామాల్లో వరి నారుమడులు, పంట పొలాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. రైతులకు పలు సూచనలిచ్చారు. విత్తనాలు చల్లిన పొలంలో మూడు రోజుల కన్నా ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంటే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందన్నారు. వీలైనంత వరకు నీటిని పూర్తిగా బయటకు తీసివేయాలని సూచించారు. దీని వల్ల విత్తనం గాలి పోసుకుని, త్వరగా మొలక వస్తుంది. పూర్తిగా నీట మునిగితే మళ్లీ విత్తనాలు చల్లుకోవాల్సి ఉంటుందన్నారు. నెలరోజుల వ్యవధిలోపు ఉన్న నారుమళ్లలో నీరు బయటకు తీసేసి, ఐదు సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలని సూచించారు.

300 ఎకరాల్లో వరిసాగు

ప్రత్తిపాడు: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలు రైతాంగానికి కాస్త ఊరట నిచ్చాయి. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకూ ఆశించిన మేర వర్షాలు కురవలేదు. దమ్ములు చేసేందుకు సరిపడా తడి లేకపోవడంతో అధికశాతం రైతాంగం వెదజల్లు పద్ధతిలోనే సాగుకు ఉపక్రమించారు. ప్రత్తిపాడు మండలంలోని వివిధ గ్రామాల్లో సుమారు 300 ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. ఏలూరు, బవురువాక, బురదకోట, ఉలిగోగులు, దోపర్తి, తాడువాయి తదితర గిరిజన గ్రామాల్లో వెదజల్లు పద్ధతిలో సాగు చేపట్టారు. వర్షాలకు రైతులు సాగు పనులను ముమ్మరం చేశారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



రోటరీ క్లబ్ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న కిశోర్ కుమార్

తుని: రోటరీక్లబ్ కార్యవర్గం ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ సీహెచ్ కిశోర్ కుమార్ సూచించారు. స్థానిక రోటరీ ఫంక్షన్ హాలులో శుక్రవారం సాయంత్రం క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. సంఘ అధ్యక్షుడిగా చల్లా మంగరాజు, కార్యదర్శిగా నల్లల వీర్రాజు, కోశాధికారిగా కర్రి కిశోర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులతో కిశోర్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గం సహకారంతో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని నూతన అధ్యక్షుడు మంగరాజు తెలిపారు. పలువురు పట్టణ ప్రముఖులు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే గేటు మీదుగా యథావిధిగా రాకపోకలు



గోపాలపట్నంలో రైల్వేగేటు తెరచుకోవడంతో యథావిధిగా సాగుతున్న వాహనాల రాకపోకలు

తొండంగి: మండలంలోని గోపాలపట్నం రైల్వేగేటు ట్రాక్ మరమ్మతులు పూర్తయ్యాయి. అధికారులు రైల్వే గేటును తెరవడంతో యథావిధిగా వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. ఈ నెల 15 నుంచి 18 వరకూ ట్రాక్ మరమ్మతుల నిమిత్తం రైల్వేగేటును అధికారులు మూసివేశారు. దీంతో వాహనదారులు నాలుగు రోజుల పాటు పి.ఇ.చిన్నాయపాలెం, రావికంపాడు రైల్వేగేట్లు ద్వారా రాకపోకలు సాగించి ఇబ్బందులు పడ్డారు. కాగా రెండు రోజుల పాటు కుండపోత వర్షం వల్ల ట్రాక్ పనులకు అంతరాయం కలిగినప్పటికీ ఎట్టకేలకు అధికారులు గోపాలపట్నం రేల్వే గేటుకు మరమ్మతులు పూర్తి చేసి వాహనాల రాకపోకలను పునఃప్రారంభించారు. గేటు వద్ద ట్రాక్ దాటేందుకు వాహనాలు వెళ్లే మార్గంలో తారు రోడ్డు వేయాల్సి ఉంది. దీంతో వాహనాల రాకపోకలు ట్రాక్ వద్ద నెమ్మదిగా సాగుతున్నాయి.

ఇంటిపన్ను ప్యూరిఫికేషన్‌ను వేగవంతం చేయండి



కోటనందూరులో హౌస్‌ట్యాక్స్ ప్యూరిఫికేషన్‌ను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్

కోటనందూరు: ఇంటిపన్ను ప్యూరిఫికేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఈఓపీఆర్డీ జి.అరుణ్ కుమార్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని కోటనందూరు, కేఏ మల్లవరం గ్రామ సచివాలయాల్లో జరుగుతున్న ఇంటిపన్ను ప్యూరిఫికేషన్ ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్యూరిఫికేషన్ ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచనలు చేశారు. యజమాని నివసిస్తున్న ఇంటి ఆధారంగా పన్నును నిర్ధారించాలన్నారు. కొత్త ఇళ్లకు ఇంటి పన్నును వేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ పంచాయతీల ఆదాయం పెంచడమే లక్ష్యంగా ప్యూరిఫికేషన్ ప్రక్రియ జోరుగా సాగుతుందన్నారు. నిబంధనల మేరకు ఇంటి నిర్మాణాల ఆధారంగా ఇంటిపన్ను విధిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి



గోకవరంలో శానిటేషన్ పనులను పర్యవేక్షిస్తున్న ప్రత్యేకాధికారి ముఖలింగం

గోకవరం: ప్రస్తుతం తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి ముఖలింగం సూచించారు. మండల కేంద్రమైన గోకవరంలో శుక్రవారం ఆయన పర్యటించారు. పంచాయతీ కార్యాలయం వద్ద శానిటేషన్, మంచినీటి ట్యాంక్‌లో క్లోరిన్ శాతాన్ని తనిఖీ చేశారు. అనంతరం స్థానిక అంబేడ్కర్‌పేటలో శానిటేషన్ పనులను పర్యవేక్షించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్యాన్ని మెరుగుపర్చి ప్రజలు వ్యాధుల బారిన పడకుండా చూడాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ గోవిందు, ఈఓపీఆర్‌డీ రాజేశ్వరరావు, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తుప్పలు.. రాకపోకలకు తిప్పలు



షిర్డీనగర్‌లో రోడ్డుకు ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలు

ఏలేశ్వరం: స్థానిక షిర్డీనగర్‌లోని గాంధీజీ విగ్రహానికి సమీపంలో సీసీ రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోయాయి. తుప్పలు ఏపుగా పెరిగిపోయి రహదారిని మూసేశాయి. దీంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. రహదారిపైకి తుప్పలు రావడంతో ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా తప్పుకొనేందుకు వీలులేక ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే రహదారి తుప్పలతో మూసుకుపోవడంతో పాటు పాముల బెడద ఎక్కువగా ఉండడంతో మహిళలు భయాందోళలకు గురవుతున్నారు. దీనిపై మున్సిపల్ అధికారులకు పలు సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు



గోకవరంలో శాకంబరి అలంకరణలో దేవీచౌక్ కనకదుర్గమ్మ

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు ఉపాధ్యాయుల రమేష్, కోట వంశీ, ఫణిశర్మ, చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 24 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్షకుంకుమార్చన

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలోనూ, కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు కంచిభట్ల సాయిరామ్ ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

శాకంబరిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మ శుక్రవారం శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పవిత్ర ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాసశర్మ సుమారు 1000 కేజీల వివిధ రకాల కూరగాయలు, పండ్లతో అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

మినీ గోకులాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

రౌతులపూడి: మండలంలో మినీ గోకులాల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు మండల పశువైద్యాధికారి ఎం.వీరరాఘవరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు పశువుల గల మినీ గోకులం ఏర్పాటుకు యూనిట్ విలువ రూ. 1.15 లక్షలన్నారు. దీనిలో ఉపాధి హామీ నిధులు రూ.1.35 లక్షలు కాగా రైతు వాటా కింద రూ.11,500 చెల్లించాల్సి ఉందని తెలిపారు. నాలుగు పశువుల మినీ గోకులం ఏర్పాటుకు రైతు వాటా రూ.18,500 చెల్లిస్తే మిగిలినవి ఉపాధి హామీ నిధుల నుంచి ఏర్పాటు చేస్తారన్నారు. ఆరు పశువుల మినీ గోకులం ఏర్పాటుకు యూనిట్ విలువ 2.30 లక్షల కాగా రైతు వాటా రూ.23,000 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, వలస, డీనోటిఫైడ్ తెగలవారు, దారిద్ర్యరేఖకు దిగువున ఉన్నవారు, మహిళా యజమాని, అంగవైకల్య యజమాని గల కుటుంబాలకు చెందినవారు, చిన్న, సన్నకారు రైతులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల పాడిరైతులు మండల పశువైద్యశాల లేదా స్థానిక సచివాలయంలో సంప్రదించాలని సూచించారు.

సమాచార హక్కు సంఘం కన్వీనర్‌గా రామకృష్ణ

గోకవరం: జై ఆంధ్ర, జై భారత్ సమాచార హక్కు సంఘం అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కన్వీనర్‌గా మండలంలోని రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన బత్తిన రామకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బీహెచ్ సుమిత్రానందన్ నుంచి ఉత్తర్వులు అందాయని శుక్రవారం ఆయన తెలిపారు. సమాచార హక్కు చట్టం పరిరక్షణకు చేసిన సేవలకు గాను తనకు ఈ బాధ్యతలు అప్పగించారన్నారు. సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

'భోజనాన్ని' సద్వినియోగం చేసుకోవాలి

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల్లో పీఎం పోషణ్ పేరిట ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ-2 పి.పుల్లయ్య అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేస్తున్న స్వచ్ఛంద సంస్థ భోజనాన్ని నాసిరకంగా వండుతోందని వస్తున్న ఫిర్యాదుల మేరకు భోజనాన్ని రుచి చూసి పలు సూచనలిచ్చారు. అనంతరం ఆయన భోజన పథకం రికార్డులను తనిఖీ చేశారు. పాఠశాలలోని మౌలిక సదుపాయాలను పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. హెచ్ఎం మీనా మాధురి, ఉపాధ్యాయులు హనుమంతురావు, ప్రకాష్, సీఆర్పీలు పాల్గొన్నారు.

10వ తరగతికి పునాది వేసుకోవాలి

ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: 10వ తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించడానికి ఎనిమిదో తరగతి నుంచే పునాది వేసుకోవాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలో మాధవపట్నం హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. ప్రభుత్వ హైస్కూల్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు 'గ్రేడ్-ఎ'లు పెరగాలని సూచించారు. 8వ తరగతి నుంచి పాఠ్యాంశాలపై దృష్టి సారిస్తే విజయం సులభతరం అవుతుందని చెప్పారు. ఈ మేరకు ఉపాధ్యాయులు వెనుక బడిన విద్యార్థులను గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఇటీవల ప్రకటించిన ట్రిపుల్ ఐటీలో మండల పరిధిలో 16 మంది విద్యార్థులు ఎంపికవగా 14 మంది ప్రభుత్వ పాఠశాలల వారేనని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల పుస్తకాలను పరిశీలించి వారి నుంచి సమాచారం సేకరించారు. అలాగే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు.



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ-2 పుల్లయ్య



మాధవపట్నంలోని హైస్కూల్ విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య